
# సాక్షి జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 18 । జూన్ । 2023


**ప్రతీ బిడ్డకు తండ్రే రోల్‌మోడల్**
- విలువలు పంచుతూ.. ప్రేమను చూపుతూ..
- ఆదర్శంగా నిలుస్తున్న తండ్రులు
- నేడు ఫాదర్స్ డే

కష్టాలు గుండెల్లో దాస్తూ కన్నీళ్లను కళ్లలో మోస్తాడు. పుట్టెడు దుఃఖాన్ని పట్టించుకోకుండా బిడ్డల భవిష్యత్ కోసం కలలు కంటాడు. నాన్న.. నిరంతర చైతన్య దీప్తి. ప్రేమను పంచే స్ఫూర్తి. ఆయనొక గొప్ప ఆస్తి. బతుకై.. మెతుకై.. గీతై.. రాతై ఉన్న తానికి ఊపిరి పోసే మహా శక్తి. నేడు (ఆదివారం) ఫాదర్స్ డే సందర్భంగా ఆదర్శంగా నిలుస్తున్న అధికారులు వారి తండ్రిపై ఉన్న అనుబంధాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

- వివరాలు 8లో ▸

## న్యూస్‌రీల్

### స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ రాష్ట్రస్థాయికి ఎంపిక

భూపాలపల్లి అర్బన్: స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ 2022–23 రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపికైనట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యా శాఖ అధికారి రాంకుమార్, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల నుంచి ప్రైమరీ విద్యార్థులకు మడత బెంచ్‌ల ఏర్పాటు అనే ఆలోచనలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 19నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బూట్ క్యాంపులో జరిగే ఇన్నోవేషన్‌లో ప్రాజెక్టుల రూపకల్పన చేస్తారని తెలిపారు. అక్కడే రాష్ట్రస్థాయి తుది పోటీలను నిర్వహిస్తారన్నారు.

### పోరాటాలతోనే సమస్యల పరిష్కారం




భూపాలపల్లి అర్బన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని.. సమరశీల పోరాటాలతోనే సమస్యలను పరిష్కారమవుతాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన ప్రారంభించగా నాగయ్య హాజరై మాట్లాడారు. రాబోయే కాలమంతా కమ్యూనిస్టు పార్టీలదే అన్నారు. శ్రమజీవులంతా ఐక్యమై సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు రాజేందర్, రమేష్, శంకర్, దేవేందర్, మల్లయ్య, ప్రీతి, శ్రీకాంత్, రజినీకాంత్, లక్ష్మి, కోమల పాల్గొన్నారు.

### ఎస్పీని కలిసిన సీఐ



కాటారం: ఇటీవల ఎస్పీగా పదోన్నతి పొందిన ఏఎస్పీ శ్రీనివాసులును శనివారం కాటారం సీఐ రంజిత్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతి పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని సీఐ శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

### మేడిపల్లి ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం



కాటారం: పదో తరగతి ఫలితాల్లో మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల అభినందిస్తూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో శనివారం ప్రిన్సిపాల్ దివ్య, విద్యార్థులు రాధిక, సవితలను సన్మానించారు. కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ప్రిన్సిపాల్, విద్యార్థులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్, ఏటీడీఓ దేశిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి బాక్సింగ్‌కు రంగయ్యపల్లి విద్యార్థి



టేకుమట్ల(రేగొండ): ఉమ్మడి వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఇటీవల నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో జూనియర్ విభాగంలో రేగొండ మండలంలోని రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అరుణ్ ప్రతిభ చాటాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రఘు శనివారం తెలిపారు. నేడు(ఆదివారం) హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలో అరుణ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల, ఉపాధ్యాయులు దేవేందర్, రవీందర్, లక్ష్మీపతి, రజిని, ఉమా అభినందించారు.

## నాన్న పేరుతో నిత్యం సేవా కార్యక్రమాలు



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం 2018లో గండ్ర మోహన్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్(జీఎంఆర్‌ఎం)ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగుల కుటుంబసభ్యులకు ప్రతి రోజు మధ్యాహ్నం వంద మందికి పైగా అన్నదానం చేస్తున్నారు. నిరుద్యోగులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తూ లైసెన్స్‌లు ఇప్పిస్తున్నారు. మూడు నెలల పాటు టెట్, గ్రూప్–1, గ్రూప్–2 ఉచిత కోచింగ్ ఇప్పించారు. ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. తన తండ్రి ప్రజల మదిలో ఉండేందుకు సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర తెలిపారు.

# గులాబీ శ్రేణుల హోరు.. అభివృద్ధి పనుల జోరు..



**ఉదయం 10.38 గంటలనుంచి రాత్రి 8.17 వరకు సాగిన కేటీఆర్ వరంగల్ పర్యటన**

- దాదాపు పది గంటలకుపైగా జిల్లాలో గడిపిన ఐటీ మంత్రి
- కాకతీయ మెగా టెక్స్‌టైల్‌లో యంగ్‌వన్ కంపెనీకి భూమి పూజ
- వరంగల్ నగరంలో రూ.618 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- రాత్రి ఆజంజాహి మైదానంలో బహిరంగ సభ



వరంగల్‌లో సభకు హాజరైన కార్యకర్తలు

సాక్షి, వరంగల్/ వరంగల్/వరంగల్ అర్బన్/కాశిబుగ్గ/ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బిజీబిజీగా గడిపారు. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన మంత్రి కేటీఆర్ ఉదయం 10.38 గంటలకు కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కులో దిగారు. దాదాపు పది గంటలపాటు కేటీఆర్ పర్యటన సాగింది. వరంగల్ జిల్లాలోని గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని యంగ్‌వన్ కంపెనీల నిర్మాణానికి భూమిపూజతోపాటు వరంగల్ నగరంలోని రూ.618 కోట్ల అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్, మేయర్ గుండు సుధారాణి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, డిప్యూటీ మేయర్ రిజ్వానా శమీమ్, డీసీపీ బారి, ఏసీపీ కిషన్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పైలాన్ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్



వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ భూమి పూజలో కొబ్బరికాయ కొడుతూ..



వరంగల్ నాయుడుపెట్రోల్‌పంపు వద్ద ఇన్నర్‌రింగ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన మంత్రి దయాకర్‌రావు తదితరులు



దేశాయిపేటలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తున్న ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

### పోలీసుల అత్యుత్సాహం..

మంత్రి కేటీఆర్ పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఓసిటీలో క్యాంపు కార్యాలయం ప్రారంభానికి మంత్రి కేటీఆర్ వచ్చిన నేపథ్యంలో రిపోర్టింగ్ చేయడానికి వచ్చిన విలేకర్లను గేటు వద్దనే పోలీసులు అడ్డుకున్నారు. చాలాసేపటి వరకు లోపలికి అనుమతించలేదు. కొంతమంది విలేకర్లు లోపలి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు నెట్టేశారు. అక్కడ విలేకరులకు, పోలీసులకు వాగ్వాదం చోటుచేసుకుంది. నాయుడు పెట్రోల్ పంపు వద్ద ఇన్నర్ రింగ్ రోడ్డు పనులకు శంకుస్థాపన సమయంలో ఓ చానల్‌కు చెందిన వీడియో జర్నలిస్టుపై ఓ ఎస్ఐ చేయి చేసుకున్నాడు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది.



ఓ సిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట విలేకరులను నెట్టివేస్తున్న ఓ పోలీస్ అధికారి

### కేఎంటీపీ దేశంలోనే అతి పెద్దది
- స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- యంగ్‌వన్ కంపెనీ యూనిట్‌కు శంకుస్థాపనలో మంత్రి కేటీఆర్

- 8లో ▸

### కేటీఆర్ పర్యటనలో ఫ్లెక్సీవార్
- తూర్పులో పోటాపోటీగా ఏర్పాటు
- మరోసారి బహిర్గతమైన విబేధాలు

### పర్యటన సాగిందిలా..

**ఉదయం 10.49:** గీసుకొండ మండలం శాయంపేటలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌లో రూ.840 కోట్ల పెట్టుబడితో 298 ఎకరాల్లో కంపెనీ కార్యాలయాలు నిర్మించనున్న కొరియా కంపెనీ 'యంగ్‌వన్'(టెక్స్‌టైల్ అండ్ అప్పరెల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్)కి భూమిపూజ కార్యక్రమానికి హాజరయ్యారు. 11.53 గంటలకు భూమి పూజ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.

**12:44:** వరంగల్ ఓ సిటీలో తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మంత్రి కేటీఆర్ చేరుకొని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే నరేందర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను కుర్చీలో కూర్చోబెట్టి అభినందించారు. అక్కడే లంచ్ చేశారు. వివిధ శాఖల అధికారులతో సుమారు గంటన్నరకు పైగా సమీక్షలు నిర్వహించారు.

**2:46:** ఆజంజాహి మిల్లు మైదానంలో కేటాయించిన స్థలంలో వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ముందుగా వేదమంత్రోచ్ఛరణలతో పూజ చేసి నవధాన్యాలు, మట్టి పోశారు. కేటీఆర్ స్వయంగా గడ్డపార వేసి పనులకు అంకురార్పణ చేశారు. అనంతరం అక్కడి నుంచి బస్సులో బయల్దేరారు.

**3:05:** వరంగల్ దేశాయిపేటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన డబుల్ బెడ్‌రూంలను పరిశీలించారు. అనంతరం అక్కడే నిర్మించతలపెట్టిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు శంకుస్థాపన చేశారు.

**3:10:** బ్యాంక్ కాలనీలో వ్యాపారవేత్త కాసం ఓం నమఃశివాయ్య స్వగృహానికి చేరుకొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడ చిన్న రోడ్లు, మూలమలుపు ఉండడంతో బస్సు దిగి, మరో వాహనంలో ఎక్కారు.

**3:30:** గోపాలస్వామి గుడి జంక్షన్ కొత్తవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆవిష్కరించి, కొద్దిసేపు మాట్లాడారు. లక్ష్మణ్ బాపూజీ గొప్పతనాన్ని వివరించారు.

**3:50:** గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఆవరణలో జనరల్ ఫండ్ నిధులు రూ.17 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో చిరకాలం గుర్తుండి పోయేలా చక్కని నిర్ణయం తీసుకున్న మేయర్‌ను అభినందించారు. అనంతరం పోచమ్మమైదాన్‌లో హరిత హోటల్ శంకుస్థాపన కార్యక్రమం షెడ్యూల్‌లో ఉన్నా.. ఆగకుండా వెళ్లారు.

**సాయంత్రం 4:00:** మండి బజారు దర్గా వద్ద ప్రార్థనలు చేశారు.

**4:10:** వరంగల్ చౌరస్తాలో 16 స్మార్ట్‌సిటీ రోడ్ల పనులను ప్రారంభించారు.

**4:20:** రూ.74.50 కోట్లతో చేపట్టనున్న వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను కేటీఆర్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. బస్‌స్టేషన్ నిర్మాణ, ఆదాయం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ, నియో, రైల్వేస్టేషన్ ఒకే గొడుగు కిందకు రావాలని మంత్రి సూచించారు.

**4:52:** వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు వద్ద ఇన్నర్ రింగ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

**5:00:** ఉర్సు చెరువు వద్ద మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను ప్రారంభించారు.

**5:10:** ఉర్సు రంగలీలా మైదానంలో జీడబ్ల్యూఎంసీ, 'కుడా' అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

**5:53:** ఉర్సు దర్గా వద్ద స్మార్ట్ వర్క్ పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడే ఉన్న దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**6:24:** ఖిలా వరంగల్ ఫోర్ట్‌కు చేరుకున్నారు. మధ్యకోటలో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫసాడ్ లైటింగ్‌ను ప్రారంభించారు. చారిత్రక అందాలతోపాటు నగరంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రదర్శించిన వీడియో చిత్రాలను తిలకించారు.

**రాత్రి 7.21:** వరంగల్ ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభకు చేరుకున్నారు. అక్కడ వరంగల్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

**8.17**కు సభాస్థలి నుంచి హైదరాబాద్‌కు పయనమయ్యారు.

గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



### గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగు

గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో ఎకరం స్థలంలో రూ.2 కోట్ల నిధులతో గిరిజన భవన నిర్మాణ పనులకు కలెక్టర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శంకుస్థాపన చేశారు.

- భూపాలపల్లి రూరల్

- వివరాలు 9లో ▸

# రిటైర్డ్ ఎంపీడీఓ సుపారీ హత్య!?

- మృతదేహం ఆచూకీ తెలపని పోలీసులు
- భూ విషయమై అడ్డుపడుతున్నాడని ఘాతుకం?
- అధికార పార్టీ నేతల హస్తంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- పోలీసుల అదుపులో అనుమానితులు



రామకృష్ణయ్య (ఫైల్)

బచ్చన్నపేట/జనగామ: జనగామ జిల్లాలో కిడ్నాప్‌నకు గురైన రిటైర్డ్ ఎంపీడీఓ నల్లా రామకృష్ణయ్య (70) దారుణ హత్యకు గురైనట్లు ప్రచారం జరుగుతోంది. అయినా మృతదేహం ఆచూకీ లభించలేదు. మూడు రోజులుగా మిస్టరీకి తెరపడినట్లు పోలీసులు సూచనప్రాయంగా అంగీకరిస్తున్నా.. క్లారిటీ ఇవ్వడం లేదు. అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపించడంతో... వరంగల్ కమిషనర్ రంగనాథ్ రంగంలోకి దిగినట్లు సమాచారం. కిడ్నాప్‌పై స్థానిక పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ బృందం అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న క్రమంలో.. రామకృష్ణయ్య హత్య సమాచారం శనివారం సాయంత్రం బయటకు వచ్చింది. జనగామ మండలం సరిహద్దు చినరామన్‌చర్ల–పెదరామన్‌చర్ల శివారు చెరువు వద్ద మృతదేహం ఉన్నట్లు మొదటగా పుకార్లు వినిపించగా... ఆ తర్వాత చంపక్‌హిల్స్ క్రషర్ సమీపంలోని లోయ(చెరువు) వద్ద ఉందని తెలిసింది. ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రాత్రి వరకు ఆరాతీశారు. దీనిపై అర్ధరాత్రి ఒంటి గంట వరకు కూడా పోలీసులు అధికారిక ప్రకటన చేయలేదు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే అవకాశం ఉండడంతో... మృతదేహం ఆచూకీ లభ్యమైనప్పటికీ పోలీసులు గోప్యత ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

**మూడు రోజులుగా విచారణ**

బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన నల్లా రామకృష్ణయ్య గతంలో నర్మెట, రఘునాథపల్లి, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో ఎంపీడీఓగా పనిచేశారు. రిటైర్డ్ అయిన తర్వాత ఇంటి వద్ద ఉంటూ.. ఆర్టీఐ కార్యకర్తగా యాక్టివ్‌గా పనిచేస్తున్నాడు. అతను ఈ నెల15న మధ్యాహ్నం మండల కేంద్రం నుంచి తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. అదే రోజు కుటుంబ సభ్యులు అనుమానితులపై పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనను కిడ్నాపర్లు జనగామ మండలం ఓబుల్ కేశ్వాపురం వైపు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించి, ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. కిడ్నాప్ చేసే సమయంలో రామకృష్ణయ్య సెల్‌ఫోన్ దారిలో పడిపోయింది. సెల్ సిగ్నల్‌ను ట్రాక్ చేసిన పోలీసులు.. ఓ రైతు వద్ద ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ జిల్లా ప్రజా ప్రతినిధి భర్తతోపాటు ఆయన సోదరుడు, మరో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. కిడ్నాప్‌నకు పాల్పడింది అధికార పార్టీకి చెందిన వ్యక్తి అని బాధితులు ఫిర్యాదు చేయడంతో.. సీపీ రంగనాథ్ స్వయంగా రంగంలోకి దిగారు. టాస్క్‌ఫోర్స్ టీం సీఐతోపాటు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపి లోతుగా విచారణ జరిపిస్తున్నారు. ఆయన హత్యకు ముందస్తు ప్లాన్ వేసి, సుపారీ గ్యాంగ్‌కు పెద్దఎత్తున డబ్బులు ముట్టజెప్పినట్లు భావిస్తున్నారు.

**హత్యకు దారితీసిన ఉదంతం?**

ఇటీవల గోపాల్‌నగర్ శివారులోని ఓ సర్వే నంబర్‌లోని భూమిలో నిరుపేదలు గుడిసెలు వేశారు. తన భూమిలో గుడిసెలు ఎలా వేస్తారని ఓ బీఆర్‌ఎస్ నేత అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు భూమి ప్రభుత్వ/అసైన్డ్ పరిధిలో ఉందని రామకృష్ణయ్య వారికి భరోసా ఇస్తుండడంతో..గుడిసెలు వేశారని సదరు బీఆర్‌ఎస్ నేత అనుమానం వ్యక్తం చేసినట్లు పోలీసులు తమ విచారణలో ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం.

**పోలీసులు పట్టించుకోలేదు..**

తమ తండ్రి రామకృష్ణయ్యను కిడ్నాప్ చేసిన రోజునే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, దర్యాప్తు ఆలస్యం చేయడంతోనే ఇంతపని జరిగిందని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త, బీఆర్‌ఎస్ నేత అంజయ్యనే హత్య చేయించారని కుమారులు అశోక్, శ్రావణ్, భరత్ తెలిపారు. ఎమ్మెల్యే కూడా వెనకుండి నడిపించారని ఆరోపించారు.

## వడదెబ్బతో ముగ్గురి మృతి


సమ్మయ్య మృతదేహం

వెంకటాపురం(కె): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం వడదెబ్బతో ముగ్గురు మృతి చెందారు. ములుగు జిల్లా వెంకటాపురం(కె) కుమ్మరి బజార్‌లో ట్రాక్టర్ డ్రైవర్ ఎట్టి సమ్మయ్య(45)కు రెండు రోజులుగా ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఓ రేకుల షెడ్‌లో ఉంటున్నాడు. శనివారం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


రాంబాబు (ఫైల్)

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారంలో వ్యాపారి బొడ్డు రాంబాబు (42) వడదెబ్బతో చెందాడు. కూరగాయలు విక్రయిస్తూ సొమ్మసిల్లిపడిపోయారు. గమనించిన భార్య రుద్ర స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వాంతులు చేసుకొని మృతి చెందినట్లు తెలిపారు.


అనసూర్యమ్మ (ఫైల్)

డోర్నకల్ : మానుకోట జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు నర్రా లక్ష్మయ్య సతీమణి అనసూర్యమ్మ(94) అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు శనివారం చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది.

## రోడ్డు ప్రమాదంలో పాలేరు ..


సుధాకర్(ఫైల్)

హసన్‌పర్తి: సైకిల్, గుర్తుతెలియని వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ పాలేరు మృతి చెందాడు. హసన్‌పర్తికి చెందిన ఆరెపల్లి సుధాకర్ (60) ఓ వ్యక్తి వద్ద 15 ఏళ్లుగా పాలేరుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి పనులు ముగించుకుని సైకిల్‌పై హసన్‌పర్తికి బయల్దేరాడు. కిట్స్ వైపు నుంచి అంబాలకు వైపునకు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఎదురుగా వస్తున్న సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై విజయ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.



## తండ్రి పేరుతో ట్రస్ట్, ఫౌండేషన్


తండ్రి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సబ్ రిజిస్ట్రార్

ములుగు : నా తుదిశ్వాస వరకు నాన్నను స్మరించుకుంటానని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా ఆమెను పలకరించిన 'సాక్షి' తో మాట్లాడారు. నా చిన్నతనంలో తండ్రి సర్వర్ మహ్మద్‌ను 1987లో తప్పుడు సమాచారంతో మావోయిస్టులు కాల్చిచంపారు. ప్రజలకోసం పనిచేస్తున్న మంచి వ్యక్తిని చంపామని మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. ఉద్యోగంలో చేరాక 2013లో నాన్న పేరు మీద సర్వర్ చారిటబుల్ ట్రస్ట్, ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశాను. పేదలకు అందించే సేవలతో తండ్రి ప్రజల్లో బతికి ఉంటారని అనుకున్నాను. ఉద్యోగ బాధ్యతలు చూసుకుంటూనే అనాథలు, అభాగ్యులకు అండగా నిలుస్తున్నాను. స్వగ్రామంలో తండ్రి స్తూపాన్ని ఏర్పాటు చేసి ఏటా నివాళి అర్పిస్తున్నానని చెప్పారు.

## నాన్న జ్ఞాపకార్థం.. విద్యార్థులకు చేయూత


విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని కంబాలపల్లికి చెందిన రిటైర్డ్ హార్టికల్చర్ అధికారి నూకల మహేందర్‌రెడ్డి తన తండ్రి, గ్రామ మాజీ సర్పంచ్ దివంగత నూకల కృష్ణారెడ్డి పేరుమీద ప్రతి సంవత్సరం విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్నారు. నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి 2021 నుంచి కంబాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రతి ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాల పేరిట రూ. 20 వేలు నగదు బహుమతి ఇస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు నగదు పురస్కారాలు, మెమొంటోలు అందజేశారు.

## ఏజీఎఫ్‌తో ప్రజాసేవ..


మాట్లాడుతున్న కేటీఆర్ (ఫైల్)

హసన్‌పర్తి : ప్రజాసేవలో 'అరూరి గట్టుమల్లు ఫౌండేషన్' ముందుకు సాగుతోంది. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ 2016 సంవత్సరంలో తన తండ్రి గట్టుమల్లు పేరిట ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ఈ ట్రస్ట్ ద్వారా నిరుపేదలు, పలువురు విద్యార్థులకు చేయూతనిస్తున్నారు. అలాగే, వివిధ పోటీ పరీక్షల్లో నిరుద్యోగులకు వందరోజులు ఉచిత శిక్షణ ఇచ్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఇదిలా ఉండగా 'గట్టుమల్లు' ఫౌండేషన్ సేవలను మంత్రి కేటీఆర్ అభినందించారు. కాగా, నిరుపేదలు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనందిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ అరూరి రమేశ్ తెలిపారు.




'మన జీవితాన్ని గెలిపించేందుకు, తను అలుపెరగకుండా నిత్యం శ్రమించే నిస్వార్థ శ్రామికుడు నాన్న.. ఉరుములా గంభీరంగా ఉరిమినా, ఆ వెనక చల్లని వర్షమై కురిసే ప్రేమనే నాన్న'...

## నాన్నకు కృతజ్ఞతలు..


తండ్రి రాధాకృష్ణారావుతో కుమారుడు రిత్విక్ సాయి

హన్మకొండ: 'సివిల్స్‌కు సన్నద్ధమవ్వడం ఖర్చుతో కూడుకున్న అంశం.. అయినా భారం పడుతుందనే ఆలోచన మాలో కనిపించకుండా మా నాన్న నన్ను చదివించి విజయతీరాల వైపు నిలిపారు' అని సివిల్స్ 558వ ర్యాంకర్ కొట్టే రిత్విక్ సాయి అన్నారు. తాను సివిల్స్‌కు సన్నద్ధమయ్యేందుకు తన తండ్రి కొట్టె రాధాకృష్ణారావు ఎంతో ప్రోత్సహించారన్నారు. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు ఎంతో ఆందోళన చెందాను.. అప్పుడు నాన్న నాలో ధైర్యం నింపారు. ఆ ధైర్యంతో ఇంటర్వ్యూకు హాజరై విజయం సాధించి మా నాన్న కల నెరవేర్చానన్నారు. ప్రతిసారి ప్రోత్సహించి విజయం వైపు నడిపించిన నాన్నకు కృతజ్ఞతలు.

## అమ్మలేని లోటు తీరుస్తూ..


నాన్న బద్రినారాయణతో సిద్దాంత్

మహబూబాబాద్ అర్బన్ : నాన్నే నా మొదటి గురువు..నా బెస్ట్ ఫ్రెండ్. గెలిచినప్పుడు ఆనందంగా పది మందికి చెప్పుకుని ఓడినప్పుడు భుజం తట్టి గెలుస్తావులే అని దగ్గరకు తీసుకునే వ్యక్తే మానాన్న అని పేర్కొన్నాడు సంక సిద్దాంత్. మానుకోటలోని సంక బద్రినారాయణ–రాజేశ్వరీ దంపతుల కుమారుడు సిద్దాంత్ ప్రస్తుతం యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నా. ఐదేళ్ల క్రితం మా అమ్మ అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి నాన్న అన్నితానై నన్ను, చెల్లిని చూసుకుంటూ సలహాలు, సూచనలు ఇస్తున్నాడు. నాన్న ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నాన్న ఉద్యోగం వదిలేసి అమెరికాకు రావాలని అడుగగా ఒప్పుకోలేదు. అమ్మ జ్ఞాపకాలతోనే ఇక్కడే ఉంటాను అని అన్నాడు. నా ఊపిరి ఉన్నంత వరకు నాన్నను కళ్లలో పెట్టి చూసుకుంటాను.

## నాన్న స్ఫూర్తితో క్రీడాకారిణిగా..


తండ్రి ప్రభాకర్‌తో సాయిశ్రీ

స్టేషన్‌ఘన్‌పూర్ : జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన తన తండ్రి నీరటి ప్రభాకర్ స్ఫూర్తితోనే తాను బాల్ బ్యాడ్మింటన్ రాకెట్ పట్టుకున్నానని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు తన తండ్రి స్ఫూర్తియే కారణమని ఘన్‌పూర్‌కు చెందిన నీరటి సాయిశ్రీ తెలిపారు. సాయిశ్రీ ప్రస్తుతం కాళోజీ నారాయణ హెల్త్ మెడికల్ యూనివర్శిటీలో ఫైనలియర్ చదువుతుంది. ఏడవ తరగతిలో మొదటగా బాల్‌బ్యాడ్మింటన్ రాకెట్ పట్టుకుని తండ్రికి తగ్గ తనయగా ఎన్నో పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటింది. జాతీయ స్థాయిలో మూడు ఛాంపియన్ షిప్‌లు, మూడు బంగారు పతకాలు సాధించింది. ప్రస్తుతం తెలంగాణ టీమ్ కెప్టెన్‌గా ఉన్నానంటే నాన్న ప్రోత్సాహం, ఆశీర్వాదమే కారణం.

## కూతురు ఉన్నతికి తపన..


ఆకాంక్షతో తల్లిదండ్రులు లలిత, రాంరెడ్డి

బచ్చన్నపేట:'మన కూతురును కానని రాజ్యం పంపించి చదివించడం అవసరమా? ఇక్కడే చదివిద్దాం.. మీ ఆలోచన విరమించుకోండి' అని భార్య ఎంత వారించినా ఆ తండ్రి పట్టించుకోలేదు. పురుషులతో సమానంగా చదివించాలని పట్టుబట్టి అనుకున్నది సాధించాడు. ప్రస్తుతం తన కలను కూతురు సాధించడంతో ఆ తండ్రి ఆనందానికి అవధులు లేవు. మండలంలోని మొండి కుంటకు చెందిన పుర్మ లలిత, రాంరెడ్డి దంపతులకు ఒక్క కూతురు ఆకాంక్ష. రాంరెడ్డి తన కున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో తమ ఏకైక కూతురును ఉన్నతంగా చదివించాలనుకున్నాడు. 1 నుంచి 10వ తరగతి వరకు జనగామలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ , హైదరాబాద్‌లో డిప్లొమా చదివించారు. ప్రస్తుతం డిప్లొమా పూర్తి చేసుకున్న ఆకాంక్ష.. ఈ–సెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించించి తండ్రి కల నెరవేర్చింది.



## నాన్న ప్రోత్సాహంతోనే డాక్టర్ అయ్యా..

● దుస్సా వినోద్‌కుమార్, ఎంజీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్


తల్లిదండ్రులతో వినోద్‌కుమార్

ఖిలా వరంగల్: నాన్న ప్రోత్సాహంతోనే డాక్టర్ అయ్యా. మా నాన్న దుస్సా కోటేశ్వర్, అమ్మ భాగ్య లక్ష్మి. మాది వ్యవసాయ కుటుంబం. ఖిలావరంగల్ మండలం స్తంభంపల్లిలో ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నారు. మానాన్న.. నాకు చిన్నప్పుడు ప్రభుత్వ వైద్యశాలను చూపించేవారు. డాక్టర్ అయి నిరుపేదలకు వైద్య సేవలు అందించాలని చెప్పే వారు. దీంతో ఆయన ఆశయం మేరకు నేను కష్టపడి చదివి 2015లో ఎంఎస్ జనరల్ సర్జికల్, ఎంసీహెచ్ సర్జికల్ అంకాలోజీ(క్యాన్సర్) స్పెషలిస్ట్‌గా పూర్తి చేశా. ప్రస్తుతం వరంగల్ ఎంజీఎంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. నాన్న ఆశయం నెరవేర్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

## నాన్న కల నెరవేర్చేందుకు ఐపీఎస్..


నాన్నతో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సాక్షి మహబూబాబాద్ : నాన్న డాక్టర్ బాలాజీనాయక్, అమ్మ సుశీల. మా కుటుంబంలో అందరూ డాక్టర్లు, ఇంజనీర్లే. అందుకోసమే నన్ను సివిల్ సర్వీస్ ఉద్యోగం సాధించాలని చిన్నప్పటి నుంచి కుటుంబ సభ్యులు ప్రోత్సహించేవారు. దీంతో నాన్న కల నిజం చేసేందుకు కష్టపడి చదివి ఐపీఎస్ సాధించాను. నేను సివిల్ సర్వీస్‌కు ఎంపికైన రోజు అమ్మనాన్న కళ్లల్లో ఆనందాన్ని ఇప్పటికీ మర్చిపోలేను.

– శరత్‌చంద్ర పవార్, ఎస్పీ, మహబూబాబాద్

## వెన్నంటి నిలిచిన వ్యక్తి ..


తండ్రి అమర్‌తో సివిల్స్ 40వ ర్యాంకర్ శ్రీసాయి అశ్రిత్

హన్మకొండ : తాను సివిల్స్ సాధించడంలో నాన్న శాఖమూరి అమర్ వెన్నంటి నిలిచారని సివిల్స్ 40వ ర్యాంకర్ శ్రీసాయి అశ్రిత్ అన్నారు. తనకు సివిల్స్ చేయాలని ఆసక్తికి నాన్న ప్రోత్సాహం తోడవడంతో ముందుకు సాగాను. సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన తర్వాత మెయిన్స్‌కు హాజరయ్యేందుకు కొద్దిగా సంకోచించానన్నారు. ఆ సమయంలో నాన్న తనను ప్రోత్సహించారన్నారు. ఇంటర్వ్యూ అంటే భయపడ్డ తనలో భయాన్ని తొలగించారు. దీంతో ఇంటర్వ్యూను సమర్థవంతంగా ఎదుర్కొన్నా, నాన్న తోడుండడంతో ఈ విజయాన్ని సాధించాను. తనకు ఎప్పుడు తోడు నీడగా ఉన్నాడు. నాన్నకు కృతజ్ఞతలు.

## నాన్నే స్ఫూర్తి..


తండ్రితో రంజిత, మహిళా కానిస్టేబుల్ టేకుమట్ల

టేకుమట్ల : మా నాన్న మా కోసం ఎంతో కష్టపడ్డారు. కష్టం అంటే ఎంటో తెలియకుండా పెంచారు. నాన్న స్ఫూర్తితోనే పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. నేను ఉద్యోగం చేస్తున్నానంటే నాన్న అందించిన ప్రోత్సాహమే. నేడు నాన్న భౌతికంగా లేకపోయినా ఆయన అందించిన ప్రేమ, ఆశీస్సులు మా వెన్నంటే ఉంటాయి.

## కేటీఆర్ పర్యటనలో ఫ్లెక్సీవార్

● తూర్పు నియోజకవర్గంలో పోటాపోటీగా ఏర్పాటు
● మేయర్, ఎంపీ ఫ్లెక్సీలను చింపివేసిన గుర్తుతెలియని వ్యక్తులు
● ఎమ్మెల్యే నరేందర్ అనుచరులే తొలగించారని ప్రచారం
● బహిర్గతమైన ప్రజాప్రతినిధులు, నేతల అంతర్గత పోరు


ఒక ఫ్లెక్సీపై ఏర్పాటు చేసిన మరో ఫ్లెక్సీ

రామన్నపేట : మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా వరంగల్ నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత పోరు బహిర్గతమైంది. ప్రధాన రహదారుల్లో తూర్పు ఎమ్మెల్యే నరేందర్ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇతర నాయకులకు అవకాశం లేకుండా ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో తన ఫొటోలతో ఉన్న స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలతో నింపేశారు. ఈ క్రమంలో కొన్ని ప్రదేశాల్లో మేయర్ గుండు సుధారాణి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, డిప్యూటీ మేయర్ రిజ్వానాషమీమ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపివేసి, వాటిస్థానంలో ఎమ్మెల్యే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. టికెట్ రేసులో మేయర్ గుండు సుధారాణి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఉన్న నేపథ్యంలో వారి ఫ్లెక్సీలను ఎమ్మెల్యే అనుచరులు తొలగించినట్లు ప్రచారం జరుగుతోంది. తూర్పు ఎమ్మెల్యే నరేందర్ తన ఒంటెద్దు పోకడలతో తన ఫ్లెక్సీలే ఉండాలన్న ఆలోచనతో అనుచరులతో ఈ పనిచేయించినట్లు మేయర్ వర్గం వారు ఆరోపిస్తున్నారు.

**మేయర్ తన మార్క్ చూపించుకునేందుకు..**

మంత్రి కేటీఆర్ చేతులమీదుగా నగరంలోని పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో మేయర్ గుండు సుధారాణి సైతం తన మార్క్‌ను చూపించుకునేందుకు చేనేత కార్మికులు పెద్దఎత్తున నివాసముండే కొత్తవాడలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని నెలకొల్పారు. కేటీఆర్ చేతుల మీదుగా కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. కేటీఆర్ తూర్పు నియోజకవర్గ పర్యటనలో భాగంగా నాయకులు పోటాపోటీగా ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలు, కటౌట్లు ఏర్పాటు చేసినా జీడబ్ల్యూఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## గోపాలపురంలో చైన్ స్నాచింగ్

● వాకింగ్‌కు వెళ్తున్న వివాహిత మెడలో నుంచి గొలును అపహరణ
● శనివారం తెల్లవారుజామున ఘటన
● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాలపురం శివాజీ నగర్ కాలనీలో చైన్‌స్నాచింగ్ జరిగింది. శివాజీనగర్ కాలనీకి చెందిన ఉమామహేశ్వరి రోజు మాదిరిగానే శనివారం తెల్లవారు జామున వాకింగ్‌కు బయలేరింది. మార్గమధ్యంలో ఇద్దరు వ్యక్తులు ఎదురుపడి ఫోన్‌లో పొందుపరిచిన ఓ వ్యక్తి వివరాలు అడిగారు. ఫోన్ పరిశీలిస్తున్న క్రమంలో ఆమె మెడలో ఉన్న సుమారు 28 గ్రాముల చైన్‌ను లాక్కెళ్లారు. బాధితురాలు కేకలు వేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, దోపిడీకి గురైన చైన్ విలువ సుమారు రూ.1.35లక్షలు ఉంటుందని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

## కేఎంటీపీ దేశంలోనే అతి పెద్దది



మాట్లాడుతున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్

● ఉద్యోగ, ఉపాధిలో స్థానికులకే అవకాశం
● భూమి ఇచ్చిన రైతులకు త్వరలో ఎకరానికి వంద గజాల స్థలం
● రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

గీసుకొండ: 'వరంగల్‌కు పూర్వ వైభవం రావాలనే ఉద్దేశంతోనే కాకతీయుల పేరిట కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను దూరదృష్టితో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారు. కేఎంటీపీకి భూములు ఇచ్చిన రైతులకు పాదాభివందనాలు' అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. శనివారం వరంగల్ జిల్లా గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కేఎంటీపీలో దక్షిణకొరియా యంగ్‌వన్ కంపెనీ ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఈటీఎల్) యూనిట్‌కు మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అప్పటి కలెక్టర్ పార్కు భూసేకరణ కోసం చాలా కృషి చేశారన్నారు. భూములు ఇచ్చిన రైతులకు ఎకరానికి వంద గజాల ఇంటి స్థలం పట్టాలను ఆగస్టు 15లోపు పంపిణీ చేయడానికి టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ పార్కు ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ నడికూడ, దామెర మండలాలకు పోలీస్‌స్టేషన్లు, డిగ్రీ కళాశాల, గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని, పరకాల మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కేటీఆర్‌ను కోరారు.


మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే చల్లా, కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్, దక్షిణ కొరియా భారత అంబాసిడర్ చాంగ్‌జే బాక్

దక్షిణకొరియా భారత అంబాసిడర్ చాంగ్ జే బాక్, యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్, ఎంపీ దయాకర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ హ్యాండీ క్రాఫ్ట్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొల్లం సంపత్, పరిశ్రమ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ సెక్రటరీ బుద్ధ ప్రకాశ్, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, యంగ్‌వన్ ఎండీ షాజహాన్, ఐఎల్ఎఫ్‌సంస్థ నుంచి ఆర్‌సీఎస్ రెడ్డి, హైదరాబాద్ కాన్సలేట్ జనరల్ చుక్కపెల్లి సురేశ్, స్పెషల్ సెక్రటరీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్డీఓ మహేందర్‌జీ, సతీశ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

**మీసాలు తిప్పిన వాళ్లు భయపడుతాండ్లు..!**

'ధర్మారెడ్డిని చూస్తే నాకు చాలా సంతోషంగా ఉంది. మొన్న ఆయన బిడ్డ పెళ్లికి వచ్చినప్పుడు.. ధర్మన్నా ఎవరు నిలబడుతరే నీ మీద అని అన్న...నాకు తెలిసిందేంటంటే.. ఆయన మీద పరకాలలో నిలబడేందుకు ప్రతిపక్షాలు భయపడుతున్నాయనేది వాస్తవం. చాలా పెద్ద నాయకులమని మీసాలు తిప్పిన వాళ్లు కూడా భయపడి పక్కకు పోయే పరిస్థితి వచ్చింది. ప్రజలకు మంచి చేస్తూ అనుకూలంగా ఉంటే వారిని కడుపుల పెట్టుకుని చూసుకుంటరు. అంతేకాని గుండాగిరి చేస్తం, రౌడీయిజం చేస్తం అంటే వినేటోడు ఎవడు లేడు. ధర్మారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

## క్లుప్తంగా

### నియామకం

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ యూత్ భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా తోటరంజిత్‌ను నియమించినట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తోట రంజిత్ మాట్లాడుతూ.. సత్యనారాయణరావు గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### కమిటీ ఎన్నిక



తోట రంజిత్

గణపురం: మండలంలోని అప్పయ్యపల్లిలో కాంగ్రెస్ ఎస్సీసెల్ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు ఆరుముళ్ల ఎల్లస్వామి ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒంటేరు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా నోముల రాకేష్, ఉపాధ్యక్షుడిగా మంద కల్యాణ్, కోశాధికారిగా ఇనుగాల రఘుపతి, సహాయ కార్యదర్శిగా ఒంటేరు తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా రాజు, రవి, భద్రయ్య, రమేష్, నోముల రాజు, రాజయ్య, ఎనగందుల రాజయ్య, ఒంటేరు భద్రయ్యలను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మొలుగూరి రాజు, ఎల్కపెల్లి రమేష్ పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం



కన్నాయిగూడెం: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఏటూరునాగారం సీఐ రాజు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శారీరక ధృడత్వానికి, మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదపడుతాయని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ భాస్కర్, తుపాకులగూడెం సర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

### పరామర్శ



వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి చెందిన అల్లం సమ్మయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా ములుగు, భూపాలపల్లి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందించారు.

# కేసులను త్వరగా పరిష్కరించాలి



భూపాలపల్లి అర్బన్: కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి తుకారాంజీ



భూపాలపల్లి అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి

- హైకోర్టు జడ్జి తుకారాంజీ
- జిల్లా కేంద్రంలో ఫోక్సో కోర్టు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టు జడ్జి (అడ్మినిస్ట్రేషన్) తుకారాంజీ తెలిపారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన ఫాస్ట్రాగ్, ఫోక్సో కోర్టును శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాకేంద్రంలో ఒక్కొక్కటిగా అన్ని కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే సొంత భవనం నిర్మించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్థల సేకరణ పూర్తయిందన్నారు. కోర్టులో కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఫోక్సో కోర్టుకు వచ్చేటువంటి కేసులను ఎప్పటికిప్పుడు విచారణ చేపట్టాలని సూచించారు. బాధితులకు కోర్టులపై నమ్మకం కలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు, కలెక్టర్ భవేష్‌మిశ్రా, జూనియన్ జడ్జిలు జయరామిరెడ్డి, రాంచందర్‌రావు, ములుగు, మహబూబాబాద్ కోర్టుల జడ్జిలు శివజ్యోతి, చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, ఆనందరావు, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసచారి, మధు, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.

**కాళేశ్వరాలయంలో పూజలు**

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని తుకారాం జీ దర్శించుకున్నారు. శనివారం ఆయన ఆలయానికి రాగా రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు, అధికారులు మంగళవాయిద్యాలతో వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా గణపతి పూజ నిర్వహించి స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో జడ్జిని దేవస్థానం ధర్మకర్త అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి శాలువాతో సన్మానించారు. అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. ఆయన వెంట భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల జడ్జిలు, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహదేవపూర్ సీఐ కిరణ్, ఎస్సై లక్ష్మణ్‌రావు ఉన్నారు.



కాళేశ్వరం: హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న ధర్మకర్త సమ్మయ్య

# క్విజ్ పోటీలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా జులై 2న నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కోరారు. శనివారం కాటారంలో యూత్ నాయకులతో కలిసి మాట్లాడారు. క్విజ్ పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువత ఉద్యోగ, ఉపాధి మార్గాల కల్పనే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం యువతను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని వారి కోసం ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, సర్పంచ్‌లు అంగజాల అశోక్, కోడి రవికుమార్, కో ఆప్షన్ సభ్యుడు అజీజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శనివారం లేఖ రాశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కానుకగా నూతన పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్, నాలుగు డీఏలు ప్రకటించాలని తెలిపారు. 317 జీఓ ద్వారా ఇబ్బందిపడుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి, ప్రభుత్వ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు వెంటనే కల్పించాలన్నారు. ఉద్యోగులందరికీ, పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ విధానం ద్వారా అన్ని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీఆర్సీ 2020 కమిటీ సిఫార్సుల ప్రకారం ఇంకా జారీ కానీ ఉత్తర్వులను వెంటనే విడుదల చేసి పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల ఆర్థిక బిల్లులను విడుదల చేయాలని ఎమ్మెల్యే లేఖ ద్వారా డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు అందించాలని తెలిపారు.

# గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

- గిరిజన ఉత్సవాల్లో కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో ఎకరం స్థలంలో రూ.2 కోట్ల నిధులతో గిరిజన భవన నిర్మాణ పనులకు కలెక్టర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇల్లందు క్లబ్ హౌస్‌లో నిర్వహించిన గిరిజన ఉత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ప్రగతి నివేదిక చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తండాలు, గూడెంలను జిల్లాలో 17 నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు అయ్యాయని తెలిపారు. జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలు, కళాశాల వసతి గృహాల ద్వారా 2043 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారన్నారు. కాటారంలోరూ.5 కోట్ల నిధులతో పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసిందని త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

**గిరిజనుల రిజర్వేషన్లు 10 శాతానికి పెంపు..**

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గిరిజనులకు రిజర్వేషన్లను సీఎం కేసీఆర్ 10 శాతానికి పెంచారన్నారు. పోడు పట్టాలను త్వరలో గిరిజనులకు అందిస్తామన్నారు. తండాలను పంచాయతీలుగా చేస్తూ.. ప్రతీ గ్రామ పంచాయతీకి కార్యదర్శిని నియమిస్తూ స్మశాన వాటిక, కంపోస్ట్ షెడ్డు డంపింగ్ యార్డు నర్సరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిందన్నారు. అనంతరం జిల్లాలో 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులను, కుల సంఘాల నాయకులు సన్మానించారు. విద్యార్థులు, గిరిజన మహిళలు చేసిన నృత్యాలు అలరించాయి. అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరాణి, వైస్ చైర్మన్ హరిబాబు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ శోభ, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## జ్యూట్ బ్యాగుల అందజేత



బ్యాగుల పంపిణీ చేస్తున్న జీఎం శ్రీనివాసరావు

భూపాలపల్లి అర్బన్: స్వచ్ఛతా పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి ఏరియాలోని జీఎం కార్యాలయంలో శనివారం జ్యూట్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఏరియా అధికార ప్రతినిధి తుకారాం తెలిపారు. ఏరియా జీఎం శ్రీనివాసరావు హాజరై కార్యాలయంలోని అధికారులు, సిబ్బందికి బ్యాగులను అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా స్వచ్ఛత పఖ్వాడ నినాదంతో స్వచ్ఛ్ భారత్, పరిశుభ్రత పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జీఎం తెలిపారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాడానికి జ్యూట్ బ్యాగులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

## రేషన్ బియ్యం స్వాధీనం



ఇంట్లో నిల్వ ఉంచిన బియ్యం

కాటారం: మండలంలోని దామెరకుంట గ్రామంలో ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి సివిల్ సప్లై అధికారి రజాక్‌లు శనివారం స్వాధీనం చేసుకున్నారు. బండం గౌరయ్య ఇంట్లో నిల్వుంచిన 7 క్వింటాళ్లు, పర్తిపాటి రాజిరెడ్డి ఇంట్లోలో 5.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకోని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

## అందుబాటులో వరి విత్తనాలు

వాజేడు: మండల కేంద్రంలోని సహకార సంఘంలో రైతులకు కావాల్సిన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సెక్రటరీ సోమ సత్యనారాయణ తెలిపారు. ఎంటీయూ (1061) రకం విత్తనాలు 267 బస్తాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. బస్తాకు రూ.1059 చెల్లించి కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.

## విద్యార్థులకు షూ పంపిణీ



షూ అందిస్తున్న హెచ్‌ఎం రామారావు

వెంకటాపురం(కె): మండలంలోని మంగవాయిగూడెంలో గల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామారావు విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. రామారావు తండ్రి పండా పండా బజార్ జ్ఞాపకార్థం పాఠశాలలోని 44 మంది విద్యార్థులకు కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరావుతో కలసి అందించారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

మహదేవపూర్: మండలంలోని కుదురుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ కోట లక్ష్మి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ నాగరాణి అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్ నిర్మల, ఆయా శంకరమ్మ పిల్లల తల్లులు పాల్గొన్నారు.



అన్నప్రాసన చేయిస్తున్న సర్పంచ్

# మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

మహదేవపూర్: మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాంలో భాగంగా శనివారం మండలంలోని పెద్దంపేట గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజమున గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే మావోయిస్టులకు సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమన్నారు. మావోయిస్టుల గురించి ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

# 20న రీడింగ్ రూంల ప్రారంభం

టేకుమట్ల: ఈ నెల 20 విద్యాదినోత్సవం సందర్భంగా మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఎంపేడులో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూంలను ప్రారంభించనున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని ఎంపేడులో ఏర్పాటు చేసిన రీడింగ్ రూంలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, స్థానిక సర్పంచ్ కొలిపాక రాజయ్య, ఎంపీటీసీ సంగి రవికుమార్, ఎంపీఓ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ సట్ల కొమురయ్యతో పాటు తదితరులు ఉన్నారు.



రీడింగ్ రూంలను పరిశీలిస్తున్న రమేష్

# 1001వరి రకం సాగు చేయొద్దు

టేకుమట్ల(రేగొండ): వానాకాలంలో రైతులు 1001 వరి రకాన్ని సాగు చేయొద్దని రైతు బంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ హింగె మహేందర్‌జీ అన్నారు. శనివారం రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1001 రకానికి చెందిన వరి పంట ధాన్యంతో మిల్లర్లు ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడం లేదన్నారు. కావున మిల్లర్లు ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు 1061, ఎంటీయూ 1064, జేజీఎల్24428, కేఎన్‌ఎం 118తో పాటు సన్న రకాల విత్తనాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని, కావున రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తగా విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల కో ఆర్డినేటర్ మటిక సంతోష్, ఏఈఓ సునీల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హింగె మహేందర్‌జీ

## గడువు పొడిగించాలి

గణపురం: కుల వృత్తుల దరఖాస్తుల గడువును పొడగించాలని కేబీకేఎస్ జిల్లా కన్వీనర్ బత్తిని శివ శంకర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించిదన్నారు. ఇంకా పత్రాలు అందక ఎంతో మంది రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, కావున దరఖాస్తు గడువును మరో నెల రోజుల పాటు పొడగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఘనంగా గిరిజన మహోత్సవాలు



పలిమెల: గ్రామస్తులను సన్మానిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్



మహాముత్తారం: రెడ్డిపల్లిలో..

పలిమెల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనోత్సవాలను గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న గిరిజన అభివృద్ధి పథకాలపై ర్యాలీ నిర్వహించారు. అలాగే బోనాలతో గిరిజన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ పెద్దమనుషులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నరేష్, నాగయ్య, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పీటర్‌పాల్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

**చిట్యాలలో..**

చిట్యాల: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలంలోని బొసింగ్‌పల్లిలో గిరిజన మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉత్సవాల్లో బంజారా మహిళలు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నారాయణ, గిరిజన నాయకులు ఆజ్మీరా శివరాజు నాయక్, కిరణ్‌నాయక్, రాంనాయక్, భూక్యా రాజునాయక్, జవహర్‌లాల్, నందరాజు, సుమన్, సమ్మయ్య, రాజ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారం: ప్రేమ్‌నగర్‌లో గ్రామస్తులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మహాముత్తారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహాముత్తారం మండలంలోని రెడ్డిపల్లి, కనుకునూర, పెగడపల్లి, ప్రేమ్‌నగర్, నిమ్మగూడెం, సింగంపల్లి గిరిజన గ్రామాల్లో శనివారం గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గిరిజన జాతర పండగల పేరుతో ఉత్సవాలు నిర్వహించారు. ఆయా తండాల్లో లంబాడీలు సేవాలాల్ మహారాజ్‌కు, లక్ష్మీదేవర ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్‌తోపాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: బంజార నృత్యం చేస్తున్న మహిళలు



పెగడపల్లిలో పూజలు చేస్తున్న లంబాడీలు



పలిమెలలో..

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సోమయ్య

మంగపేట: మండల కేద్రానికి చెందిన బక్కయ్యకు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే సీతక్కను కోరారు. స్పందించి ఎమ్మెల్యే సీఎం సహాయనిధి ద్వారా రూ 24,000 మంజూరు చేయించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కిశోర్‌లు లబ్ధిదారుడికి శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, నాయకలు మైబూబ్‌ఖాన్, ఉజ్వల్, వెంకటేశ్వర్లు ఉన్నారు.